ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27.02.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ ఆర్టీసి ప్రవేశపెట్టిన "జీఐ ఆన్ వీల్స్" అనే చొరవ కళలను, కళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు.

2. హైదరాబాద్ లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

3. రైతుభరోసా ఇవ్వకుంటే బిజెపి ఆద్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.

4. రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## గవర్నర్

తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే తొలిసారిగా "జీఐ ఆన్ వీల్స్" అనే కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించింది. హైదరాబాద్ లోని ఎంజీబీఎస్ లో ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... జీఐ ఆన్ వీల్స్ అనే చొరవ.. రాష్ట్రాన్ని, కళలను, కళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చిందని కొనియాడారు. ఈరోజు సంస్కృతి వల్లే సమాజం మనగలుగుతోందని, జియో కల్చర్ గుర్తింపు అనేది ఈరోజుల్లో చాలా అవసరమన్నారు. పోచంపల్లి, చేర్యాల, వరంగల్ వంటి ప్రాంతాలకు చెందిన కళలను

ప్రస్తావిస్తూ... ప్రతి సమాజంలోని సంస్కృతి, చరిత్రల ప్రాధాన్యతలను భావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల సమాజం గౌరవం మరింత పెరుగుతుందన్నారు. జీఐ ఆన్ వీల్స్ కు సంబంధించిన పలు కళాకృతులు తయారు చేసిన కళాకారులను గవర్నర్ సన్మానించారు. అనంతరం జీఐ ట్యాగింగ్ ఉన్న బస్సులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, జీఐ ప్రాక్టిషనర్ శుభ్ జిత్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఎస్.ఎం

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్ లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్ మండీ, మెట్టుగూడ, అడ్డగుట్ట, తార్నాక ప్రాంతాల్లోని పలు బస్తీల్లో కేంద్ర మంత్రి పర్యటిస్తున్నారు. పలు ప్రాంతాల్లో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...

**బైట్ - కిషన్ రెడ్డి**

**జీఎస్**

**బండి సంజయ్**

రైతు భరోసా ఇవ్వకుంటే బీజేపీ అధ్వర్యంలో ఉద్యమం తప్పదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడే రేవంత్ రెడ్డికి రైతుభరోసా గుర్తుకొస్తుందని విమర్శించారు. ఈసారి రైతుభరోసా ఇవ్వకపోతే ప్రజలు ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో తమ అభిప్రాయం తెలియజేస్తారన్నారు. ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో రైతుభరోసా గురించి ఎందుకు చర్చించలేదని బండి సంజయ్ ప్రశ్నించారు.

పిటిసి, కరీంనగర్

<u>**విద్యా శాఖ**</u>

రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి లేదా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని నిర్దేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. నిన్న విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి.. వచ్చే విద్యా సంవత్సరంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున పైలట్ ప్రాజెక్టు తరహాలో మరో 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే పథకాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

**డెస్క్**

<u>**నిధులు విడుదల**</u>

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో తాజాగా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు 745 కోట్ల రూపాయలు విడుదలయ్యాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీలో భాగంగా గత జూన్ నుంచి ప్రతి నెల 700 కోట్ల రూపాయలకు తగ్గకుండా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తున్నారని వెల్లడించింది. అలాగే, గ్రామ పంచాయతీలకు 389 కోట్ల రూపాయలు ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు.

**జీఎస్**

<u>**మద్యం క్లీన్ చిట్**</u>

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత తదితరులకు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై విచారణ జరిపిన రౌస్ ఎవెన్యూ కోర్టు..

నిందితులందరిపై నమోదు చేసిన కేసులను కొట్టి వేసింది. అభియోగాలు మోపిన 22 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు పేర్కొంది.

**డెస్క్**

**బ్రేక్**

**<u>బీజేపీ అభియాస్</u>**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వక్తల శిక్షణా మహా అభియాన్ కార్యక్రమం ఈ ఉదయం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల శిక్షణ ఇన్‌ఛార్జి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కొత్త కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతం, నాయకత్వ లక్షణాలు అలవర్చేందుకు ఈ శిక్షణా తరగతులు కీలకమని తెలిపారు. తెలంగాణలో ప్రతి మండల కేంద్రంలో ఈ శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, సామాజిక సమరసత, స్వదేశీ భావాత్మకత, పౌరవిధుల పై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**డెస్క్**

**<u>హుస్సేన్</u>**

షెడ్యూల్ తెగల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ లో పర్యటించిన ఆయన.. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో జాప్యం జరగకుండా, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

పిటిసి, నిర్మల్

**<u>కలెక్టర్</u>**

యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతి ఈ ఉదయం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొత్త కలెక్టర్ కు పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

**డెస్క్**

**<u>కేటీఆర్</u>**

సూర్యాపేట జిల్లా కోదాడలో ఇటీవల పోలీసుల అదుపులో ఉండగా మృతి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ కుటుంబాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే.తారక రామారావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ ఒత్తిళ్లతోనే రాజేష్ చనిపోయాడన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున బాధితుడి కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తామని, ఆ కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

**పిటిసి, నల్గొండ**

**<u>అరైవ్.. అలైవ్</u>**

డ్రైవర్ల భద్రతే ప్రజల భద్రత అని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బి గితే అన్నారు. ఎల్లారెడ్డిపేటలో జరిగిన అరైవ్.. అలైవ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...

**బైట్ – బిగితె**

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

**<u>పి ఎం.శ్రీ</u>**

సమాజానికి రాబోయే తరాలను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కేంద్ర సాంస్కృతిక శాఖ, పిఎంశ్రీ పాఠశాలల జాయింట్ సెక్రెటరీ, నోడల్ అధికారి కమలేష్ కుమార్ మిశ్రా అన్నారు. నల్గొండ జిల్లాలో పిఎంశ్రీ పాఠశాలల ప్రిన్సిపల్స్ తో సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న కంప్యూటర్లు, టింకరింగ్ ల్యాబ్స్ వంటి అన్ని సదుపాయాలను విద్యార్థులు ప్రత్యక్షంగా వినియోగించుకునేలా చూడాలని అన్నారు.

**పిటిసి, నల్గొండ**

**ప్రపంచ వ్యాప్తంగా ఎన్జీవోల దినోత్సవం**

ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా నాన్-గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోల) దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. సమాజ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేసే స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించడం, వాటి ఆవశ్యకతను గుర్తించడం, ఎన్జీవోల గురించి అవగాహన పెంచడం, ప్రజలను స్వచ్ఛంద సేవలో భాగస్వాములను చేయడం ఈరోజు ముఖ్య ఉద్దేశంగా ఉంది.

**జీఎస్**

**చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి**

ఈరోజు భారత స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి. 1931 ఫిబ్రవరి 27న అలహాబాద్ లోని ఆల్ఫ్రెడ్ పార్క్ లో బ్రిటిష్ పోలీసులతో జరిగిన పోరాటంలో, ప్రాణం పోయే వరకు "ఆజాద్" గా ఉంటానని చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటూ ఆయన తనను తాను కాల్చుకుని అమరుడయ్యారు.

**జీఎస్**